


# నేటి నిజం

తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ శుక్రవారం 21-8-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:17 పేజీలు: 4 వెల: రూ.1/-

# కరోనాకు ధైర్యమే మందు

## కరోనా విజేతలు ప్లాస్మా దానం చేయాలి
## ప్లాస్మా దానం కోసం వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి ఈటెల

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కరోనాను ఎదుర్కొనేందుకు ఏకైక మందు ధైర్యమేనని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ధైర్యంగా ఉంటూ ఆరోగ్య సూత్రాలను పాటిస్తే కరోనాను జయించవచ్చన్నారు. ఇటీవలి అనేక కేసుల్లో ఇదే తేలిందన్నారు. అలాగే దీనికి కార్పోరేట్ వద్యం కూడా అవసరం లేదన్నారు. ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో హైదరాబాద్ పోలీసు ఆధ్వర్యంలో ప్లాస్మాదానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ... కరోనా బాధితులకు మనోధైర్యం కల్పించేలా నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొవిడ్‌కు మందులేదు.. ధైర్యంగా ఉండటమే ఏకైక మార్గమని వివరించారు. ప్లాస్మా థెరపీ ఎంతో మందికి ధైర్యం ఇచ్చిందన్నారు. కొవిడ్ ఔషధాలతో పాటు ప్లాస్మా చికిత్స ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టిందన్నారు. ప్రపంచ మానవాళికి ప్లాస్మా చికిత్స తోడ్పాటును ఇస్తోందని పేర్కొన్నారు. అన్ని ఆసుపత్రుల్లో కొవిడ్‌తో పాటు ఇతర వ్యాధులకు చికిత్స అందించాలని సూచించారు. కొవిడ్‌తో చనిపోయిన వారి మృతదేహాలను కుటుంబీకులు కూడా తీసుకెళ్లని సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. కరోనా బాధితుల పట్ల మానవత్వంతో మెలగాలన్నారు. అలాగే కరోనాను జయించిన వారు ప్లాస్మా దానం చేసి ఇతరులకు ప్రాణదానం చేయాలన్నారు. హోం మంత్రి మహమూద్ అలీ, సీపీ అంజనీకుమార్ పలువురు పోలీసు ఉన్నతాధికారులు, ప్లాస్మా దాతలు పాల్గొన్నారు. ప్లాస్మా దానం చేసేవారికోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను మంత్రి ఈటల ప్రారంభించారు.

పలాస్మా దానం చేయాలనుకునేవారు 94906 16780, 040-23434343 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

# 394 పాయింట్లు మైనస్- 38,220కు సెన్సెక్స్


## 96 పాయింట్లు పతనం-11,312 వద్ద ముగిసిన నిఫ్టీ
## బలహీనంగా బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఆటో రంగాలు

ముంబై,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ సృష్టిస్తున్న కల్లోలానికి ఆర్థిక రికవరీ అనిశ్చితిలో పడినట్లు యూఎస్ ఫెడ్ స్పష్టం చేయడంతో దేశీ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. సెన్సెక్స్ 394 పాయింట్లు పతనమై 38,220 వద్ద ముగిసింది. నిఫ్టీ 96 పాయింట్లు క్షీణించి 11,312 వద్ద నిలిచింది.

ఆర్థిక రికవరీని కోవిడ్-19 దెబ్బతీస్తున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజాగా హెచ్చరించడంతో ప్రపంచ స్టాక్ మార్కెట్లు డీలా పడ్డాయి. బుధవారం యూఎస్ మార్కెట్లు వెనకడుగు వేయగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా, యూరోపియన్ మార్కెట్లు 2-1 శాతం మధ్య నీరసించాయి. దీంతో దేశీయంగానూ ఆందోళనకు లోనైన ఇన్వెస్టర్లు తొలి నుంచీ అమ్మకాలకే కట్టుబడినట్లు నిపుణులు తెలియజేశారు. ఫలితంగా 330 పాయింట్లు తక్కువగా 38,284 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్ తదుపరి 38,156 వరకూ పతనమైంది. ఇక నిఫ్టీ సైతం తొలుత 11,290 వరకూ జారింది. తదుపరి 11,361 వరకూ కోలుకుంది. ఎన్ఎస్ఈలో ప్రధానంగా బ్యాంక్ నిఫ్టీ 1.3 శాతం క్షీణించగా.. ఐటీ, ఆటో, ఎఫ్ఎంసీజీ 0.4 శాతం చొప్పున నష్టపోయాయి. ఇతర రంగాలలో మీడియా 3.2 శాతం ఎగసింది. మెటల్ 1 శాతం, రియల్టీ 0.4 శాతం చొప్పున పుంజుకున్నాయి. నిఫ్టీ దిగ్గజాలలో టాటా మోటార్స్, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ఐసీఐసీఐ, విప్రో, ఎయిర్‌టెల్, ఎంఅండ్ఎం, టైటన్, ఇండస్ఇండ్, ఆర్ఐఎల్, అల్ట్రాటెక్, కొటక్ బ్యాంక్ 2.6-1.3 శాతం మధ్య క్షీణించాయి. అయితే ఎన్‌టీపీసీ 7 శాతం జంప్‌చేయగా, ఓఎన్‌జీసీ, పవర్‌గ్రిడ్ కోల్ ఇండియా, బీపీసీఎల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జీ, ఐవోసీ, హిందాల్కో, హీరో మోటో 3.3-1 శాతం మధ్య బలపడ్డాయి. డెరివేటివ్స్‌లో సన్ టీవీ, టాటా పవర్, జీఎంఆర్, ఎంజీఎల్, పీఎఫ్‌సీ, ఐజీఎల్, ఈక్విటాస్, టీవీఎస్ మోటార్, టొరంట్ పవర్, వోల్టాస్, జిందాల్ స్టీల్, ఉజ్జీవన్ 8.4-3 శాతం మధ్య ఎగశాయి. కాగా.. మరోపక్క ముత్తూట్, మదర్‌సన్ సుమీ, ఐసీఐసీఐ ప్రు, గోద్రెజ్ ప్రాపర్టీస్, ఎంఅండ్ఎం ÷నాన్స్, పెట్రోనెట్ 5.5-2 శాతం మధ్య తిరోగమించాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ 0.8 శాతం పుంజుకున్నాయి. ట్రేడైన షేర్లలో 1167 నష్టపోగా.. 1598 లాభాలతో ముగిశాయి.

గదు విభాగంలో బుధవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) రూ. 459 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేయగా.. దేశీ ఫండ్స్(డీఐఐలు) రూ. 97 కోట్ల విలువైన అమ్మకాలు చేపట్టాయి. మంగళవారం ఎఫ్‌పీఐలు రూ. 1,135 కోట్లను ఇన్వెస్ట్‌చేయగా.. డీఐఐలు రూ. 379 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విషయం విదితమే.

# కుటుంబ వ్యవస్థను పటిష్ట పరుచుకుందాం: వెంకయ్య



న్యూఢిల్లీ, ఆగష్టు 20: మన సనాతన సంప్రదాయంలో భాగమైన కుటుంబవ్యవస్థను పటిష్టపరుచుకోవాల్సిన అవసరం ఉన్నదని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. పెద్దలను గౌరవించుకోవడం మన సంప్రదాయమని గుర్తుచేశారు. ప్రపంచదేశాలన్నీ భారతీయ కుటుంబవ్యవస్థ గురించి గొప్పగా చెప్పుకుంటూ.. ఆచరించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో.. మన సమాజంలో అక్కడక్కడా చోటుచేసుకుంటున్న కొన్ని ఘటనలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ పార్లమెంటేరియన్స్ ఆన్ పాపులేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఏపీపీడీ) భారతదేశంలోని శిశువుల లింగ నిష్పత్తి, దేశంలో పెద్దల జనాభాకు సంబంధించి నిర్వహించిన సంపూర్ణ అధ్యయన నివేదికలను గురువారం ఉపరాష్ట్రపతి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో పెద్దలను ఆశ్రమాలకు పంపించడం పెరిగిందంటూ ఆందోళన వ్యక్తం చేసిన ఉపరాష్ట్రపతి.. పెద్దలను విస్మరించడం, వారిని అగౌరవపరచడం ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. తల్లిదండ్రుల ప్రేమాభిమానాలతో పాటు పెద్దల వద్ద పెరగడం వల్ల చాలా విషయాలను నేర్చుకునేందుకు వీలవుతుందన్నారు. ఇది నేటి సమాజానికి అత్యంత అవసరమన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ మన కుటుంబవ్యవస్థను తిరిగి పటిష్టపరుచుకోవాలని ఆయన సూచించారు.

ఏటేటా పెరుగుతున్న జనాభా కూడా ఆందోళనకరమైన అంశమన్న ఉపరాష్ట్రపతి.. జనాభా నియంత్రణపైనా ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. జనాభా నియంత్రణ లేకపోవడం వల్ల అభివృద్ధి వేగం పుంజుకోవడం కష్టమవుతుందని అన్నారు. ఈ దిశగా ప్రజలను చైతన్యపరిచి వారిలో సానుకూల ఆలోచనను రేకెత్తించేందుకు కృషిచేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కూలంకషమైన అధ్యయనంతో రూపొందించిన ఐఏపీపీడీ నివేదికను చదివి అర్థం చేసుకోవడంతోపాటు లింగ నిష్పత్తిలో మార్పులు, పెద్దలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజల్లో చైతన్యం కల్పించడంలో ప్రసార, ప్రచార మాధ్యమాలు ప్రత్యేక చొరవతీసుకోవాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

# నాలుగు రోజుల్లో ఆరుగురు ఉగ్రవాదులు మృతి : డీజీపీ

కుప్వారా, ఆగష్టు 20 : కశ్మీర్‌లో గత నాలుగు రోజుల్లో ఆరుగురు ఉగ్రవాదులు మృతి చెందగా వారిలో నలుగురు మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నారని జమ్మూ కశ్మీర్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) దిల్‌బాగ్ సింగ్ గురువారం తెలిపారు. బారాముల్లాలోని క్రెరీలో జరిగిన కార్యకలాపాల్లో ఉత్తర కశ్మీర్ లష్కర్-ఏ-తోయిబా (ఎల్ఇటీ) కమాండర్, సజ్జాద్ హైదర్, అతడి పాకిస్తాన్ కౌంటర్ ఉస్మాన్, స్థానిక సహచరుడు ఇనాయతుల్లా ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని ఆయన పేర్కొన్నారు. సజ్జాద్ మరొక స్నేహితుడు నసీరుద్దీన్ అలియాస్ అబూ సాద్ కూడా ఉత్తర కశ్మీర్‌లో ఒక సమూహాన్ని నిర్వహిస్తున్నాడని దిల్‌బాగ్ తెలిపారు. ఆర్మీ, జమ్ము, కశ్మీర్ పోలీసుల సమన్వయ ప్రయత్నాల వల్ల ఈ విజయం సాధ్యామైందన్నారు. సజ్జాద్‌ను కాల్చి చంపిన వెంటనే, నసీరుద్దీన్ అలియాస్ అబూ సాద్‌కు ఉత్తర కశ్మీర్ బాధ్యతలు అప్పగించారన్నారు. కుప్వారా జిల్లాలోని హంద్వారాలో బుధవారం భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నసీరుద్దీన్ తన సహచరుడితో పాటు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

# యస్ బ్యాంక్ కుంభకోణం

## వాధవాన్ సోదరులకు బెయిల్

ముంబై,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): యస్ బ్యాంక్ కుంభకోణంలో వాధవాన్ సోదరులకు బెయిల్ లభించింది. కోట్ల రూపాయల మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న దీవాన్ హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రమోటర్లు కపిల్ వాధవన్, ధీరజ్ వాధవన్‌లకు బొంబాయి హైకోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 60 రోజుల వ్యవధిలో చార్జిషీట్ దాఖలు చేయడంలో విఫలమైనందున బెయిల్ ఇవ్వాలన్న అభ్యర్థనపై జస్టిస్ భారతి డాంగ్రే సానుకూలంగా స్పందించారు. అయితే ఒక్కొక్కరూ లక్ష రూపాయలు సెక్యూరిటీగా జమ చేయడంతోపాటు పాస్‌పోర్టులను అప్పగించాలని వీరిద్దరిని కోర్టు ఆదేశించింది. మనీలాండరింగ్ ఆరోపణలపై వీరిని మే 14 న ఈడీ అరెస్టు చేసింది. అయితే జూలై 15 న వాధవన్స్, యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రానా కపూర్, అతని భార్య బిందు కపూర్, కుమార్తెలు రోష్నీ, రేఖ, వారి చార్టర్డ్ అకౌంటెంట్ దులరేష్ కె జైన్‌తో పాటు సహచరులపై ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. 'క్విడ్ ప్రో క్వో' కు సంబంధించి సీబీఐ 2020 మార్చి 7న ఎఫ్ఐఆర్ నమోదు చేసిన తరువాత ఈడీ ఈ కేసులో విచారణ ప్రారంభించిన సంగతి తెలిసిందే. సీబీఐ కేసు నేపథ్యంలో వీరిద్దరూ జైలులో ఉండాల్సి ఉంటుంది.


## చరిత్రలో నేటినిజం



కం॥ వసివాడని కుసుమము వలె
వసగాంగిన నటన జూప- పరవశుడగుచున్
కుసుమాస్త్రుని గన్న విభుడు
రసవర్షము గురిసినాడు "రాధిక" పైనన్!!

( ఆగష్టు 21 నటి రాధిక జననం... )

-రాధశ్రీ
సెల్: 9494481210



# దోస్త్ నోటిఫికేషన్ విడుదల

## 24 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): తెలంగాణలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి గురువారం దోస్త్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ పక్రియ చేపట్టనున్నారు. రిజిస్ట్రేషన్ పక్రియకు రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు.. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. మొదటి విడుత అడ్మిషన్లకు సంబంధించి సీట్ల కేటాయింపు సెప్టెంబర్ 16న ఉంటుంది. ఆ తర్వాత సెప్టెంబర్ 17 నుంచి 22వ తేదీ మధ్యలో ఆన్‌లైన్‌లోనే సెల్ఫ్ రిపోర్టు ఇవ్వాలి.

# ఎమ్మెల్యే సైదిరెడ్డిని సస్పెండ్ చేయాలి

## గన్‌పార్క్ వద్ద బిజెపి మహిళా మోర్చా ఆందోళన

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికే గవర్నర్ తమిళ సై పై అధికార పార్టీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి అన్నారు. గవర్నర్ పై హుజూర్ నగర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ.. గన్ పార్క్ వద్ద నిరసనకు దిగారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి వెంటనే గవర్నర్‌కు క్షమాపణ చెప్పాలని మహిళా మోర్చా నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర సర్కార్ కరోనా కట్టడిలో పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు.

గవర్నర్ తమిళసైకి సీఎం కేసీఆర్ వెంటనే క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతామూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రథమ పౌరురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే సైదిరెడ్డిని సస్పెండ్ చేయాలన్నారు. సోషల్ మీడియాలో కేసీఆర్ దండు పేరుతో గవర్నర్‌పై ట్రోలింగ్‌ను డీజీపీ అడ్డకోవాలని డిమాండ్ చేశారు. గవర్నర్‌కు ఒక పార్టీని అంటకట్టడం నీచమైన చర్య అని గీతా మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కుంగిన జంపన్నవాగు బ్రిడ్జి

ములుగు,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ):అల్పపీడన ప్రభావంతో ములుగు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో ఏటూరు నాగారం మండలంలోని జంపన్నవాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో జంపన్న వాగుపై ఉన్న బ్రిడ్జీ కుంగిపోయింది. దొడ్ల గ్రామం వద్ద ఈ ఉదయం వంతెన కూలినట్లు సమాచారం. ఈ వంతెనను జంపన్న వాగుపై 2015లో నిర్మించారు. వంతెన కుంగిపోవడంతో మల్యాల, కొండాయి, ఐలాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా.. జంపన్న వాగు ఉధృతి వల్ల మేడారం పూర్తిగా జలదిగ్బంధంలో ఉంది. సమ్మక్క గద్దెల చుట్టూ నీరు చేరింది.

# కేంద్రమంత్రి షెకావత్‌కు కరోనా

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి బారిన మరో కేంద్ర మంత్రి పడ్డారు. తాజాగా కేంద్ర జల శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో వైద్యుల సూచన మేరకు కేంద్ర మంత్రి ఆస్పత్రిలో చేరారు. ఈ సందర్భంగా గజేంద్ర సింగ్ షెకావత్ ట్వీట్ చేస్తూ.. తనకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయిందని తెలిపారు. ముందస్తు జాగ్రత్తగా డాక్టర్ల సలహా మేరకు ఆస్పత్రిలో చేరాను. ఇటీవల తనను కలిసిన వారంతా కొవిడ్ టెస్టులు చేయించుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేశారు.

# ప్రాంతీయ భాషల్లో క్రెడిట్ స్కోరు

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): రుణాలు తీసుకోవడానికి అవసరమైన క్రెడిట్ నివేదిక, స్కోర్‌ను పైసాబజార్ డాట్‌కామ్ ప్రాంతీయ భాషల్లో అందించనుంది. తెలుగుతోపాటు కన్నడ మరాఠీల్లో క్రెడిట్ నివేదికలను ఉచితంగా పైసాబజార్ వెబ్, యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కంపెనీ సహ

వ్యవస్థాపకుడు, సీఈఓ నవీన్ కుక్రేజా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకకు చెందిన ఖాతాదారులకు ప్రాంతీయ భాషలో లభించే నివేదికలు ఉపయోగపడగలవన్నారు.

# దేశంలో 28 లక్షల మార్కును దాటిన కేసులు

## ఒక్కరోజే 69 వేలకుపైగా నమోదు
## కొత్తగా కరోనా వల్ల 977 మంది మృతి

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి ఉగ్రరూపం దాల్చింది. వైరస్ పంజా విసరడంతో వేల సంఖ్యలో ప్రజలు కరోనా బారినపడుతున్నారు. బుధవారం 64 వేలకుపైగా కరోనా కేసులు నమోదవగా, గురువారం 69 వేలకుపైగా మందికి కరోనా వైరస్ సోకగా, ఒక్కరోజులో 60 వేల మంది బాధితులు కరోనా నుంచి కోలుకున్నారు. దేశంలో భారీగా కరోనా కేసులు నమోదవుతుండటంతో 28 లక్షల మార్కును దాటాయి. దేశంలో గత 24 గంటల్లో కొత్తగా 69,652 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

ఒకేరోజు ఇంత పెద్దసంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదవడం ఇదే మొదటిసారి. దీంతో దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 28,36,926కు చేరింది. ఇప్పటివరకు నమోదైన పాటివ్ కేసుల్లో 20,96,665 మంది బాధితులు కోలుకోగా, 6,86,395 మంది దవాఖానల్లో చికిత్సపొందుతున్నారు. అదేవిధంగా బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు కరోనా వల్ల 977 మంది కొత్తగా మరణించారు. దీంతో కరోనాతో మరణించిన బాధితులు 53,866కు పెరిగారని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించింది. ఒకేరోజులో 9 లక్షలకుపైగా కరోనా పరీక్షలు నిర్వహించామని కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఆగస్టు చివరినాటికి ఒక్కరోజులో పది లక్షల మందికి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, నిన్న 9 లక్షలు దాటడంతో లక్ష్యానికి మరింత చేరువయ్యామని తెలిపింది. గత 24 గంటల్లో 60 వేలకుపైగా బాధితులు కోలుకుని డిశ్చార్జీ అయ్యారని వెల్లడించింది. ఇప్పటివరకు కోలుకున్నవారి సంఖ్య ఇదే అత్యధికమని పేర్కొంది. దీంతో దేశంలో రికవరీ రేటు 73 శాతం దాటిందని తెలిపింది.

# కొందరి కబంధ హస్తాల్లోనే అధికారం

## బడుగులకు రాజ్యాధికారం దక్కడం లేదు
## మండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): తెలంగాణ శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామి గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొన్ని కులాలే పరిపాలన, ప్రజాస్వామ్యాన్ని నడిపిస్తున్నాయన్నారు. అధికారం కొంతమందికే పరిమితమైందన్నారు. కుల రక్కసి తన వికృత రూపాన్ని ప్రదర్శిస్తూ బడుగు బాలహీన వర్గాలకు అన్యాయం చేస్తోందన్నారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శ్రీ నారాయణగురు జయంతి వేడుకల్లో స్వామి గౌడ్ తన ఆవేదన వ్యక్తం చేశారు. వందేళ్ల క్రితం ఏర్పడ్డ కుల రక్కసి పునాదులే ఇప్పటికి పరిపాలనను కొనసాగించడం... బలహీన వర్గాలపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు.దేశంలో గుడి , బడి కొంతమందికే పరిమితి కావడం... మళ్ళీ మొదటికి రావడం వల్ల నారాయణ గురువును జ్ఞాపకం చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. కుల రక్కసి తన వికృత రూపాన్ని ప్రదర్శిస్తూ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ నారాయణ గురు ఆశయాలను బడుగు బలహీన వర్గాల ప్రజలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. కౌన్సిల్ ఛైర్మన్‌గా తన పదవి కాలం ముగిసినప్పటి నుంచి స్వామి గౌడ్ పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా పాల్గొనడం లేదు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు,వరదలకు దెబ్బతిన్న వరిపంట

## ఇళ్లు కూలి ఎందరో రోడ్డున పడ్డారు
## వీరందిరినీ అదుకోవాలన్న సిపిఎం నేతలు

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ):భారీ వర్షాలు.. వరదలకు వరి పంట పూర్తిగా దెబ్బతినిందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు.. వరదలతో ముంపు ప్రాంతాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నందున ప్రభుత్వం తక్షణమై అప్రమత్తమై నీటి పారుదల కాలువలపై పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం కురుస్తున్న వర్షాలతో ప్రతి గ్రామంలో మూడు నుంచి ఐదు ఇళ్లు కూలిపోయి నట్లు సమాచారం వస్తోందని.. ఇల్లు కోల్పోయిన వాళ్లకు తక్షణమే పునరావాసం కల్పించాలని రాఘవులు డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఆశతో ? ఉన్న వాటిని బాగుచేసుకోలేకపోయామని బాధితులు వాపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే సమస్యలన్నింటిని పరిష్కరించి ఆదుకోవాల న్నారు. భారీ వర్షాలు.. వరదలతో నష్టపోయిన బాధితులకు పరిహారంగా ప్రభుత్వం ప్రతి కుటుంబానికి కనీసం పది వేల రూపాయల నగదు.. 25 కిలోల బియ్యం ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. కరోనా మహమ్మారి కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని స్వయంగా గవర్నరే వ్యాఖ్యానించారు.. వరద ప్రాంతాల్లో కరోనా వ్యాప్తి పెరిగే ప్రమాదం కనిపిస్తోంది? అక్కడి ప్రజలకు పూర్తి స్థాయిలో టెస్టులు చేయాలన్నారు. హైకోర్టు కూడా ప్రభుత్వాన్ని మొట్టికాయలు వేసిందని గుర్తు చేసిన ఆయన ఇప్పటికైనా ప్రభుత్వం కరోనా పరీక్షలు పెంచాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించడంతో పాటు ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడిని అరికట్టాలని.. భద్రాచలం పట్టణాభివృద్ధికి ప్రకటించిన వంద కోట్లు వెంటనే విడుదల చేయాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

# సెలవులో 4వేల మంది ఉద్యోగులు

## జీతాలు లేకుండానే ఇంటిపట్టున ఉన్నట్లు సమాచారం

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): గోఎయిర్ విమానయాన సంస్థలో ఆరుగురు సీనియర్ అధికారులు రాజీనామా చేశారు. కరోనా సంక్షోభం వల్ల విమాన సర్వీసుల రాకపోకలు నిలిచిపోవడంతో గోఎయిర్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. వాడియా గ్రూప్ ప్రమోట్ చేసిన గో ఎయిర్ లో 6,700మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, కరోనా సంక్షోభం వల్ల 4వేల మంది ఉద్యోగులు జీతం లేకుండా సెలవులో వెళ్లారని సమాచారం. ప్రస్తుత విమానయానరంగం పరిస్థితిని అంచనా వేస్తూ వ్యయం తగ్గించుకునేందుకు గో ఎయిర్ సంస్థ చర్యలు తీసుకుంటోంది. మార్చి నెలలో చాలామంది ఉద్యోగులకు వేతన కోతలు ప్రకటించిన గోఎయిర్ 60 శాతం సిబ్బందికి ఎల్‌డబ్ల్యూపీ పథకాన్ని ప్రకటించింది. ఈ సంక్షోభంతో గోఎయిర్ సీనియర్ ఉద్యోగులు రాజీనామా చేశారని విమానయాన వర్గాలు వెల్లడించాయి. గోఎయిర్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వినయ్ దూబే స్థానంలో కౌశిక్ ఖోనాను నియమించింది.

# అటవీ భూముల కేటాయింపులపై కేసు

## హైకోర్టులో విచారణ

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఘన్‌పూర్ మండలం మైలవరం గ్రామం సమిపంలోని అటవీ భూములను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కేటాయించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై 4 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఈ భూములకు సంబంధించి న్యాయవాది వి.గంగాప్రసాద్ దాఖలు చేసిన పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్, జస్టిస్ బి.విజయసేన్ రెడ్డిల ధర్మాసనం బుధవారం విచారించింది. 'మైలవరం గ్రామంలో సర్వే నంబర్లు 54, 55, 204/1, 205/1లో కొండలతో కూడిన దాదాపు 250 ఎకరాల అటవీ భూమి ఉంది. జిల్లా కోర్టుల భవన సముదాయంతో పాటు ఇతర నిర్మాణాలకు ఈ భూమిని కేటాయించారు.

25 ఎకరాలను జిల్లా కోర్టుల భవన సముదాయాల నిర్మాణానికి, 20 ఎకరాలను పీజీ కళాశాల భవనాలకు, ఐదెకరాలు టూరిజం కార్పొరేషన్‌కు, 2.30 ఎకరాలు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం కేటాయించింది.

నిరుపయోగమైన, నీటి సౌకర్యం లేని భూములను మాత్రమే నిర్మాణాలకు కేటాయించాలని 2012లో ప్రభుత్వం జీవో జారీ చేసింది.

ఈ జీవోకు విరుద్ధంగా వృక్షాలున్న ఈ భూమిని నిర్మాణాలకు కేటాయించారు. ఈ భూ కేటాయింపులను చట్టవిరుద్ధంగా ప్రకటించి నిర్మాణాలు చేపట్టకుండా ఆదేశాలివ్వండి'అని పిటిషనర్ తరఫు న్యాయవాది నివేదించారు.

# జాతీయ వ్యవసాయ విధానం రావాలి

నేటి నిజం
శుక్రవారం 21-8-2020

దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నాయి. జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించాలి. ఇకపోతే కరోనా నేపథ్యంలో తోణంగా మనం మన వ్యవసాయాన్ని అభిశృద్ధి చేసుకునే దిశగా ఆలోచనలు చేయాలి. వ్యయసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. కరోనాతో ఇప్పుడు నిరుద్యోగం పెరిగింది. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగగలవు. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి. వ్యవసాయంపై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగు బడులు తగ్గించుకుని మన రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. కరోనా నేర్పిన గుణపాఠం మనకు అనుభవం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలి. వ్యవసాయరంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థిక రంగం పురోగమించదు. ప్రధానంగా అనేకరకాల పప్పుధాన్యాలు, వంటనూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. కనీసం ఓ పదేళ్ల పాటు వ్యవసాయరంగ ఉత్పత్తులపై దృష్టి సారిస్తే భారతదేశం ఆర్థకంగా మళ్లీ పుంజుకోగలదు. కరోనాతో ఇప్పుడు అనేకమంది మళ్లీ వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. వారి శక్తిసామర్థ్యాలను ఉపయోగించుకునేలా చేయాలి. ఈ క్రమంలో విదేశాలకు భారీగా ఎగుమతి చేసేలా పంటలు పండించగలగాలి. దీంతో మనకు విదేశీమారకం కూడా ఆదా కాగలదు. అలా పంటలు పండించే సత్తా మన రైతాంగానికి ఉందని గుర్తుంచుకోవాలి. మన రైతులనే ప్రోత్సహించి మన పంటలనే కాపడుకునేలా రైతాంగ విధానాలు వస్తే తప్ప వారు బతికి బట్ట కట్టేలా లేరు. కరువులు వచ్చినా, వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారు తున్నారు. చిన్నాచితక వ్యాపారాలతో తోపుడు బళ్లు నడుపుతున్నారు. ఇప్పుడు వారంతా కరోనా భయంతో తిరిగి గ్రామాలకు చేరారు. వారిని వ్యవసాయంలో స్థిరపడేలా చేయాలి. వ్యవసాయ భూమి లేని కూలీలు కౌలుకు తీసుకొని నష్టాలపాలయి బ్రతుకునీడ్చలేక, అవమానం భరించలేక, చివరికి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణమాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్దంగా ఉంటున్నారు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. ప్రతి ఎకరాకు కౌలు 10 వేల నుంచి 25 వేల రూపాయల వరకు భూమి యజమానులకు చెల్లించవలసి వస్తుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం మంచిగా అయినప్పటికీ ధరలు రాక నష్టపోతున్నారు. వర్షాలు లేని సంవత్సరంలో పంటలు ఎండిపోయి నష్ట పోతున్నారు. కాలం అయినా గాని, కరువు అయినా గాని రైతుకు మిగిలేది అప్పులే. మార్కెట్‌లో రైతును దోచుకునే శక్తులు నిరాటంకంగా విజృంభిస్తూనే ఉన్నాయి. రైతులను దోచుకుంటున్న వారికి తిండి ఎలా వంటబడుతుందో అర్థం కావడం లేదు. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. అంతెందుకు రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ వాగ్దానాన్ని నెరవేర్చగలగాలి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగ దీస్తున్నాయి. చాలామంది రైతులు, కౌలుదారులు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు, వడ్డీ వ్యాపారస్థుల దగ్గర అప్పు తీసుకుంటే తడిసి మోపెడవుతుంది. ఈ సమస్యలను అధిగమించి రైతుకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు రుణామాఫీ ప్రకటించి మొక్కుబడి తీర్చుకుంటున్నారు. దీంతో సమస్య తాత్కాలిక ఉపశమనం కలిగిస్తోంది తప్ప సమస్యను శాశ్వతంగా దూరం చేయడం లేదు. ఈ విధానాలకు స్వస్తి పలికి నిపుణుల సలహాతో వ్యవసాయరంగాన్ని పారిశ్రామిక రంగంగా అభివృద్ధి చేయాలి.

## ఉమ్మడి అర్హతా పరీక్ష నిర్వహణ కోసం నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూ ఢిల్లీ, ఆగస్టు 20:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల నియామకంలో పరివర్తనాత్మక సంస్కరణలకు మార్గం సుగమం చేస్తూ నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ (ఎన్.ఆర్.ఎ) ఏర్పాటుకు తన ఆమోదం తెలిపింది.

### రిక్రూట్‌మెంట్ సంస్కరణలు-యువతకు వరం:

ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులు ఒకే అర్హతా నిబంధనలు ఉన్నప్పటికీ, వివిధ పోస్టులకు బహుళ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు నిర్వహించే వేర్వేరు పరీక్షలకు హాజరు కావలసి ఉండేది.

అభ్యర్థులు పలు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలకు ఫీజు చెల్లించాల్సి వచ్చేది. వీరు ఈ పరీక్షలకు హాజరుకావడం కోసం దూరప్రాంతాలకు వెళ్లవలసి ఉండేది. ఇలా పలు రిక్రూట్‌మెంట్ పరీక్షలకు హాజరుకావడం విద్యార్థులకు , అటు రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలకు భారంగా ఉండేది. నివారింపదగిన, పదేపదే పెట్టే ఖర్చులు, శాంతి భద్రతలు, సెక్యూరిటీ సంబంధిత సమస్యలు, పరీక్షా కేంద్రాల విషయంలో సమస్యలు ఉండేవి. సగటున ప్రతి పరీక్షకు 2.5 కోట్ల నుంచి 3 కోట్ల మంది అభ్యర్థులు హాజరయ్యేవారు. ఈ ఉమ్మడి అర్హతా పరీక్షతో అభ్యర్థులు ఒకసారి ఈ పరీక్షకు హాజరై, ఈ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు నిర్వహించే ఏదైనా ఒక లేదా అన్ని ఉన్నతస్థాయి పరీక్షలకు హాజరుకావడానికి వీలుంటుంది. ఇది అభ్యర్థులందరికీ ఒక వరం లాంటిది.

### నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ

బహుళ ఏజెన్సీ సంస్థ అయిన నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ (ఎన్.ఆర్.ఎ) గ్రూప్ బి, గ్రూప్ -సి (నాన్ టెక్నికల్) పోస్టులకు సంబంధించి అభ్యర్థులను స్క్రీన్ చేయడానికి లేదా షార్ట్ లిస్ట్ చేయడానికి ఉమ్మడి అర్హతా పరీక్షను నిర్వహిస్తుంది. ఎన్.ఆర్.ఎ లో రైల్వే మంత్రిత్వ శాఖ, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం, ఎస్.ఎస్.సి, ఆర్.ఆర్‌బి, ఐబిపిఎస్‌ల ప్రతినిధులు ఉంటారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం, అత్యుత్తమ పద్ధతులకు ఎన్.ఆర్.ఎ ఒక స్పెషలిస్టు సంస్థగా ఉంటుంది.

### అందుబాటులో పరీక్షా కేంద్రాలు:

దేశంలోని ప్రతి జిల్లాలో పరీక్షా కేంద్రాల ఏర్పాటు వల్ల దూర ప్రాంతాలలో నివశించే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు బాగా అందుబాటులోకి వస్తాయి. దేశంలోని 117 ఆకాంక్షిత జిల్లాలలో పరీక్షలు నిర్వహించేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టిపెట్టనుండడం వల్ల , అభ్యర్థులు వారు నివశించే ప్రాంతానికి దగ్గరలోనే పరీక్ష రాయడానికి వీలు కలగనుండడం కీలక మలుపు. దీనివల్ల లభించే ప్రయోజనాలలో ఖర్చు, శ్రమ, భద్రత వంటివి ముఖ్యమైనవి. ఈ ప్రతిపాదన వల్ల పరీక్షా కేంద్రాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందుబాటులో ఉండడమే కాక, దూరప్రాంతాలలో ఉన్న విద్యార్థులు కూడా కేంద్ర ప్రభుత్వ పరీక్షలలో పాలుపంచుకోవడానికి, తద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో వారి ప్రాతినిధ్యాన్నిపెంచుకోవడానికి వీలు కలుగుతుంది. ఉపాధి అవకాశాలను ప్రజల వద్దకు తీసుకుపోవడం అనేది విప్లవాత్మకమైన చర్య. ఇది యువత సులభతర జీవనానికి ఎంతగానో ఉపకరిస్తుంది.

### పేద అభ్యర్థులకు ఎంతో ఊరట:

ప్రస్తుతం బహుళ ఏజెన్సీలు నిర్వహిస్తున్న పలు పరీక్షలకు అభ్యర్థులు హాజరు కావలసి వస్తోంది. పరీక్షా ఫీజుతోపాటు, అభ్యర్థులు ప్రయాణ, భోజన, లాడ్జింగ్ లాంటి ఇతర ఖర్చులు భరించాల్సి వస్తోంది. ఇక నుంచి ఒకే ఒకే ఒక పరీక్షవల్ల అభ్యర్థులకు చాలా వరకు ఆర్థిక భారం తగ్గుతుంది.

### మహిళా అభ్యర్థులకు ఎంతో ప్రయోజనం:

మహిళా అభ్యర్థులు, ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు, వేర్వేరు పరీక్షలకు హాజరు కావాలంటే వారు రవాణాసదుపాయాలు ఏర్పాటు చేసుకోవడం, ఎంతో దూరంలో ఉన్న ప్రాంతంలో ఉండడానికి ఏర్పాట్లు చేసుకోవడం అవసరమయ్యేది. దూరంగా ఉన్న పరీక్షా కేంద్రాలకు వెళ్లడానికి మహిళా అభ్యర్థులు ఒక్కోసారి తోడు తీసుకువెళ్లాల్సి వచ్చేది. ప్రతి జిల్లాలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయనుండటం, గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు ప్రత్యేకించి మహిళా అభ్యర్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

### గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరం:

గ్రామీణ నేపథ్యం ఉన్న అభ్యర్థుల ఆర్థిక ఇతర పరిమితుల రీత్యా ఇంతకు ముందు, అభ్యర్థులు తాము ఏ పరీక్ష రాయాలో ఎంచుకోవాల్సి ఉండేది. కానీ, ప్రస్తుత ఎన్.ఆర్.ఎ కింద అభ్యర్థులు ఒక పరీక్ష రాసి చాలా పోస్టులకు పోటీ పడవచ్చు. ఎన్.ఆర్.ఎ తొలి దశ, టైర్ -1 పరీక్ష నిర్వహిస్తుంది. ఇది ఎన్నో ఇతర ఎంపికలకు పునాదిగా పనికివస్తుంది.

### సిఇటి స్కోరు మూడేళ్ల వరకు పనికి వస్తుంది, ఎన్నిసార్లు అయినా రాయవచ్చు:

అభ్యర్థుల సిఇటి స్కోరు , ఫలితాలు వెల్లడి అయినప్పటి నుంచి మూడు సంవత్సరాల వరకు చెల్లుబాటు అవుతుంది. చెల్లుబాటు అయిన స్కోరులో ఉత్తమమైనది అభ్యర్థి ప్రస్తుత స్కోరుగా పరిగణిస్తారు. అభ్యర్థి సిఇటి పరీక్ష ఎన్నిసార్లు అయినా రాయవచ్చు. దీనిపై పరిమితులు లేవు. అయితే గరిష్ఠ వయోపరిమితి నిబంధనలకు లోబడి ఇది ఉంటుంది. ఎస్.సి, ఎస్.టి, ఒబిసి ఇతర కేటగిరీల అభ్యర్థులకు ప్రభుత్వ విధానం ప్రకారం గరిష్ఠ వయోపరిమితిలో రాయితీ ఉంటుంది. ఇది ఈ పరీక్షలు రాయడానికి ప్రతి సంవత్సరం పెట్టే కృషి, సమయం, డబ్బు వంటి ఇబ్బందులన్నింటినీ తొలగించడంలో ఎంతో ఉపయోగపడుతుంది.

### ప్రమాణీకృత పరీక్షలు:

గ్రాడ్యుయేట్, హయ్యర్ సెకండరీ (12 పాస్), మెట్రిక్యులేట్ (10 పాస్) స్థాయి అభ్యర్థులకు, నాన్ టెక్నికల్ పోస్టులకు ప్రస్తుతం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్.ఎస్.సి), రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డులు (ఆర్.ఆర్.బిలు), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ (ఐబిపిఎస్‌లు) నిర్వహించే రిక్రూట్ మెంట్‌కు మూడు స్థాయిలలో వేరు , వేరుగా ఉమ్మడి అర్హతా పరీక్ష నిర్వహిస్తారు.. సిఇటి స్కోరు స్థాయిలో స్క్రీనింగ్ ఆధారంగా ప్రత్యేక టైర్ -2, టైర్ -3 తదితర ప్రత్యేక స్థాయిలలో సంబంధిత రిక్రూట్‌మెంట్ ఏజెన్సీలు పరీక్షలు నిర్వహిస్తాయి.ఈ పరీక్షకు పాఠ్యాంశాలు ప్రమాణాల ప్రకారం కామన్‌గా ఉంటాయి. ఇది అభ్యర్థులపై భారాన్ని తగ్గిస్తుంది. ఇప్పటివరకు ప్రతి పరీక్షకు వేరు వేరుగా , వేరు వేరు పాఠ్యాంశాలతో పరీక్షలకు హాజరుకావలసి ఉండేది.

### పరీక్షల షెడ్యూలు, కేంద్రాల ఎంపిక

అభ్యర్థులు కామన్ పోర్టల్లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకునే సదుపాయం , పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకునే సదుపాయం కల్పిస్తారు. అందుబాటును బట్టి వారికి పరీక్షా కేంద్రాలు కేటాయిస్తారు. అంతిమంగా , అభ్యర్థులు తమ పరీక్షలను తాము ఎంచుకునే పరీక్షా కేంద్రంలో షెడ్యూలు చేసుకునే సదుపాయం కల్పించే స్థాయికి చేరేలా చూడడం దీని లక్ష్యం.

# బహుళజాతి కంపెనీలకే కాదు

**వ్యవసాయానికి అండ కావాలి**
**దిగుబడులపై ఆంక్షలు విధించుకుంటేనే పురోగతి**

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణమిదేనని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. కరోనా వేళ ప్రజలంతా మళ్లీ ఉపాధి వదులకుని గ్రామాలకు తరలారని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయం రంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు.ఈ యేడు వర్షాలు విపరీతంగా పడడమే గాకుండా వరదలు పొంగి నదులన్నీ ఉప్పొంగుతున్నాయి. ఈ దశలో నీటి సంరక్షణతో పాటు, రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి వంటలే. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. స్వాతంత్ర్యం లభించి 73సంవత్సరాలు పూర్తయినా ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. అప్పుడు మన అసవరాలకు అనగుణంగా పంటల విధానం వస్తుందని అన్నారు.

# వైరస్‌బారిన పడిన పోలీసుల ప్రాణాలను కాపాడుతాం

**మెరుగైన వైద్యసదుపాయం అందించేందుకు సిద్దంగా ఉన్నాం**
**-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి**



కరీంనగర్, ఆగష్టు 20 (నేటినిజం ప్రతినిధి): ప్రస్తుతం నెలకున్న వైరస్‌వ్యాప్తి ఉధృతి నేపధ్యంలో పోలీసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పోలీసులు వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మెరుగైన వైదసౌకర్యం అందించి వారిప్రాణాలను కాపాడుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. వైరస్‌బారినపడ్డా ఆత్మస్థైర్యంతో చికిత్సను పొందినట్లయితే సులువుగా బయపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భరోసా ఇచ్చారు.

కరీంనగర్‌లోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన 18మంది వివిధ స్థాయిలకు చెందిన పోలీసులు ఈ వైరస్‌బారిన పడిన విషయం విదితమే. బుధవారం నాటికి వైరస్‌బారిన పడ్డ పోలీసుల సంఖ్య 104కు చేరుకుంది. ఈ నేపధ్యంలో గురువారం నాడు కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కరీంనగర్‌లోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పోలీసులకు ఆత్మస్థైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వైరస్‌వ్యాప్తి ఉధృతంగా ఉందని, కనీసజాగ్రతలు పాటించడం పాటించడం ద్వారా ఈ వైరస్ బారినుండి రక్షించుకోవచ్చన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌తోపాటుగా కమిషనరేట్ వ్యాప్తంగా ఈ వైరస్‌బారినపడిన పోలీసులకు మెరుగైన వైద్యసౌకర్యం అందించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నామని చెప్పారు. వయస్సు పైబడిన వారుకూడా ఈ వైరస్‌బారిన పడి కోలుకుంటున్నారని, ఇటీవల ఒకగర్భిణి ఈ వైరస్ పాటిజివ్‌తో ఆసుపత్రిలో చేరి బిడ్డకు ఎలాంటి వైరస్ లేకుండా బిడ్డకు జన్మనిచ్చిన విషయాన్ని ఉదహరించారు. వైరస్‌సోకి ఉంటుందనే అనుమానంతో కొందరు పోలీసులు ఇళ్ళలోకికూడా వెళ్ళడంలేదనే విషయం దృష్టిలోకి వచ్చిందని, వారందరినీ వైద్యపరీక్షలు చేయించి ఆసుపత్రిలో వైద్యసౌకర్యం అందించనున్నామని, అనుమానం ఉన్న పోలీసులు వారి కుటుంబసభ్యులు వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్థానికంగా మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని, సంతృప్తి చెందని వారిని హైదరాబాద్‌లోని గాంధీ లేదా ఇతర ప్రైవేటు ఆసుపత్రులకూడా తరలించి మెరుగైన వైద్యసౌకర్యం అందిస్తామని హామీఇచ్చారు. వైద్యపరీక్షల్లో నెగటివ్ వచ్చిన వారు హోంఐసోలేషన్ ఉంటూ వైద్యుల సలహామేరకు జాగ్రతలు తీసుకున్నా కోలుకుంటారని చెప్పారు. ఈ వైరస్‌బారినపడిన ప్రస్తుతం వన్‌టౌన్‌తోపాటుగా కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు చెందిన వారందరికీ జీతంతోకూడిన సెలవులను మంజూరుచేస్తూ వైద్యపరీక్షలు చేయించనున్నామని తెలిపారు. మిగతావారిని కూడా డ్యూటీలనుండి తప్పిన్నా హోంఐసోలేషన్‌లో ఉండేవిధంగా చర్యలు తీసుకున్నామని చెప్పారు. వైరస్‌బారిన పడిన పోలీసుల పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షించేందుకు ఏసిపి స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించామని తెలిపారు. వైరస్‌బారిన పడి వివిధ రకాల వైద్యసేవలను పొందుతున్న వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు సంబంధిత అధికారులు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఫోన్‌లో మాట్లాడుతూ పరిస్థితులను సమీక్షించేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు.

<u>ఫ్రంట్‌లైన్ వారియర్స్(పోలీసులు) ఆందోళన చెందాల్సిన అవసరం లేదు</u>

రోజురోజుకూ ఉధృతమవుతున్న ఈ వైరస్‌బారిన పడిన ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పిలువబడుతున్న పోలీసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వైద్యుల సలహాలు,సూచనలను తూచతప్పకుండా పాటించడంతోపాటు ఆసుపత్రిలో లేదా ఇళ్ళలో చికిత్సపొందుతూ ఆత్మస్థైర్యంతో ముందుకుసాగితే సులువుగాబయట పడుతారని చెప్పారు. ప్రజల భద్రత,రక్షణ చర్యల్లో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనేందుకు మానసికంగా,శారీరకంగా సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. చికిత్సపొందుతున్న పోలీసుల పరిస్థితులపై ఎప్పటికప్పుడూ తెలుసుకుంటున్నామని పేర్కొన్నారు. జనసమూహంలో తిరుగకుండా, ముందస్తు చర్యలు తీసుకుంటూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించినట్లయితే ఈ వైరస్‌ధరి చేరదనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఈ వైరస్‌బారిన పడేప్రమాదం ఉందని హెచ్చరించారు. విధులకు హాజరయ్యే పోలీసులు బయటి లభించే ఎలువంటి ఆహారపదార్థాలను తినకూడదని, ఎలాంటి పానియాలను సైతం సేవించకూడదని తెలిపారు. పౌష్టిక ఆహారాన్ని తీసుకుంటూ రోగనిరోధకశక్తి పొందించుకోవాలని చెప్పారు.

### వన్‌టౌన్ ఇంఛార్జి ఇన్స్‌పెక్టర్‌గా దామోదర్‌రెడ్డి

వన్‌టౌన్‌లో ఇప్పటివరకు 18మంది ఈ వైరస్‌బారిన పడిన విషయం విదితమే. మిగతావారు కూడా టెస్టులు చేయించుకుని చిత్సలు పొందాలని చెప్పారు. వన్‌టౌన్‌కు చెందిన పోలీసుల్లో కొందరు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతుండటం, మరికొంతమంది హోంఐసోలేషన్‌లో ఉండటంతో కరీంనగర్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ దామోదర్‌రెడ్డికి మౌఖిక ఆదేశాలతో ఇంఛార్జి బాధ్యతలను అప్పగించారు. కమిషనరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన, రిజర్వ్‌లో ఉన్న వివిధస్థాయిలకు చెందిన అధికారులను ఈ మేరకు తాత్కాలికంగా నియమించి పోలీస్‌స్టేషన్ యధావిధిగా కొనసాగేవిధంగా చర్యలు తీసుకున్నారు.

### నిరాఢంబరంగా వినాయక నవరోత్సవాలను నిర్వహించుకోవాలి

ప్రస్తుతం వైరస్‌వ్యాప్తి ఉధృతంగా కొనసాగుతున్నందున రాబోవు గణేష్ నవరాత్రులు, మొహర్రం వేడుకలను నిరాఢంబరంగా జరుపుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా జనంఎక్కువగా జమకూడే అవకాశం ఉందని దీనిద్వారా వైరస్‌వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా విగ్రహాల ప్రతిష్టాపనకోసం మండపాలను ఏర్పాటు చేయకూడదని, మొహరం వేడుకలను కూడా నిరాఢంబరంగా జరుపుకునేందుకు ప్రభుత్వం ఆంక్షలను అమల్లోకి తెచ్చిందని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారి ప్రాణాలకు ముప్పుకలుగకుండా ప్రభుత్వం తీసుకున్న ముందస్తు మంచిచర్యలని అన్నివర్గాల ప్రజలు గుర్తించాలని తెలిపారు. గణేష్ నవరాత్రోత్సవాల్లో భాగంగా మండపాల ఏర్పాటుకు అనుమతి లేదని, అధేవిధంగా మొహర్రం సందర్భంగా కూడా ఎలాంటి ఊరేగింపులకు అనుమతిలేదని స్పష్టం చేశారు. కొందరు ఉత్సవనిర్వాహక కమిటీలకు చెందిన వారు క్రమంతప్పకుండా ఉండేందుకు సమీపంలోని ఆలయాల్లో మూడుఫీ ట్లకన్నా ఎక్కువకాకుండా మట్టివిగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేయాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదని చెప్పారు. విగ్రహాలు ప్రతిష్టిన ప్రదేశంలోనే నిమజ్జనం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్సవ నిర్వాహకులను కోరారు. మండపాల ఏర్పాటు లేకుండా, ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా నిరాఢంబరంగా నవరాత్రోత్సవాలను నిర్వహిస్తే తమకు అభ్యంతరం లేదని తెలిపారు. వైరస్‌వ్యాప్తి నియంత్రణతోపాటు, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలకు అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారం అందింస్తూ శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో భాగస్వాములకావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసిపి పి అశోక్, ఇన్స్‌పెక్టర్ దామోదర్‌రెడ్డి, ఎస్‌ఐలు నరేష్, శ్రీనాథ్,శ్రీనివాస్‌లతోపాటు వివిధ స్థాయిలకు చెందిన పలువురు పోలీసులు పాల్గొన్నారు.

## కష్టమర్లకు దగ్గరయ్యేలా బ్యాంకుల యత్నాలు

**ఆన్‌లైన్ లావాదేవీలు పెంచాలన్న యోచన**

న్యూఢిల్లీ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినియోగదారులకు ఈ మధ్య కాలంలో మళ్లీ దగ్గర కావడానికి యత్నిస్తోంది. కరోనాతో డీలాపడ్డ బ్యాంకింగ్ రంగాన్ని పట్టాలకెక్కించేందుకు అన్ని బ్యాంకులు యత్నిస్తున్నాయి. గృహ,వాహన రుణాలపై వడ్డీలు తగ్గిస్తోంది. అలాగే కస్టమర్లపై ఎడాపెడా వడ్డింపులకు దూరంగా ఉండాలని చూస్తోంది. ఇప్పటికే బ్యాంకుల తీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. కరోనా కష్ట కాలంలోనూ బ్యాంకులు తమ బుద్ధి పోనిచ్చుకోలేదు. రునాలపై రిజర్వ్ బ్యాంకు మారిటోరియం విధించినా వడ్డీలు మాత్రం తడిసి మోపెడు అయ్యాయి. ఇకపోతే అనేక బ్యాంకులు డెబిట్, క్రెడిట్ కార్డులు తొలగించి, మరిన్ని డిజిటల్ చెల్లింపు విధానాలను అమల్లోకి తీసుకు రావాలని యోచిస్తున్నాయి. ఆన్‌లైన్ లావాదేవీలను ప్రోత్సహించాలని చూస్తోంది. దేశంలో అయిదోవంతు జనాభాకు ఎస్‌బీఐ బ్యాంకింగ్ సేవలు అందిస్తోంది. ఎస్‌బీఐ ఖాతాదార్లలో అత్యధికులు డెబిట్‌కార్డులపై ఆధారపడి ఉన్న సంగతి విదితమే. అయినా కూడా బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి ప్లాస్టిక్ కార్డులను తొలగించాలన్నది తమ యోచన అని, ఇది సాధ్యం చేయగలమని భావిస్తున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ గతంలో తెలిపారు. ఎస్‌బీఐ అందుబాటులోకి తెచ్చిన యోనో వంటి యాప్‌ల ద్వారా, దేశీయంగా డెబిట్‌కార్డుల వినియోగాన్ని తగ్గించగలమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశం మొత్తంమీద దాదాపు 93 కోట్ల డెబిట్, క్రెడిట్‌కార్డులు వినియోగంలో ఉన్నాయని వెల్లడించారు. యోనో యాప్ సాయంతో ఏటీఎంల నుంచి నగదు ఉపసంహరించవచ్చని, కార్డు లేకుండా దుకాణాల్లో చెల్లింపులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. కొన్ని ఉత్పత్తుల కొనుగోలుకు యోనో యాప్ ద్వారా రుణం కూడా పొందవచ్చని, అందువల్ల క్రెడిట్‌కార్డు కూడా 'బేబులో ప్రత్యామ్నాయ సాధనం'గా మిగిలిపోతుందని ఎస్‌బీఐ ఛైర్మన్ వివరించారు. రాబోయే అయిదేళ్లలో దేశీయంగా కార్డు అవసరం అత్యంత పరిమితం అవుతుందని, వర్చువల్ కూపన్లే ప్రధానపాత్ర పోషిస్తాయని తెలిపారు. చెల్లింపులకు ప్రస్తుతం అనుసరిస్తున్న క్యూఆర్ కోడ్ విధానం కూడా ఖరీదైనదేనని పేర్కొన్నారు.

## మలమూత్ర విసర్జన ద్వారా కరోనా

**-మురుగు నీటిపై సిసిఎంబి పరిశోధనల్లో గుర్తింపు**

హైదరాబాద్,ఆగస్ట్20 (ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తిని గుర్తించడం కోసం పరిశోధకులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. పరిశోధనల్లో రోజురోజుకి కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కరోనా వైరస్ ఒకరి నుంచి మరోకరికి వ్యాపిస్తుందని ఇప్పటి వరకు మనం విన్నాం. కరోనా బాధితుడు దగ్గినప్పుడు, తమ్మినప్పుడు.. తప్పర్ల ద్వారా కరోనా రోగికి దగ్గరగా ఉన్నప్పుడు వ్యాధి విస్తరిస్తుంది. లేదా కరోనా రోగి వాడిన వస్తువు ద్వారా వ్యాపిస్తుందని తెలుసు. అయితే ముక్కు, నోటి ద్వారానే కాకుండా మలమూత్ర విసర్జనలోనూ వైరస్ వ్యాప్తి జరుగుతుందని తాజా పరిశోధనల్లో తేలింది. మురుగునీటిలో కరోనా వైరస్ ఆనవాళ్లు ఉన్నాయని సీసీఎంబీ, ఐఐసీటీ సంయుక్త పరిశోధనల్లో తేల్చి చెప్పింది. మురుగునీటి నమూనాలలో కరోనా వైరస్‌పై పరిశోధనలు చేశారు. ముక్కు, నోటి ద్వారానే కాకుండా మలమూత్ర విసర్జనలోనూ వైరస్ ఉంటుందని, వ్యాధి సోకిన 35 రోజుల వరకు పేషెంట్ శరీరంలో వైరస్ ఉంటుందని సీసీఎంబీ, ఐఐసీటీ సంయుక్త పరిశోధనల్లో తేల్చిచెప్పింది.

## గవర్నర్ హెచ్చరికలతో సర్కార్ కళ్లు తెరవాలి

**కరోనాపై దిద్దుబాటు చర్యలు తీసుకోవాలి**
**రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి**
**ప్రభుత్వం ఎదురుదాడి చేయడం ఆపాలి**
**-కాంగ్రెస్ నేతల మండిపాటు**

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో గవర్నర్ తమిళ్ సై ప్రభుత్వానికి మంచి సూచనలు చేస్తే.. వాటిని ఆచరణలో పెట్టడం మానేసి అధికార పార్టీ నాయకులు గవర్నర్ పై విమర్శలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండిపడింది. ఇది అధికార పార్టీ నేతల అసహనానికి నిదర్శనమని పిసిసి చీఫ్ ఉత్తమ్ తదితరులు వ్యాఖ్యానించారు. అసలు నిజాలు వెల్లడించిన గవర్నర్ కేంద్రానికి కూడా నిజాలు నివేదిస్తే బాగుంటుందన్నారు. ఇకపోతే టీఆర్ఎస్ నేతల ఎదురుదాడి సమంజసమేనా అంటూ భట్టి విక్రమార్క ప్రశ్నించారు. కరోన విజృంభిస్తుందని గవర్నర్ ముందే గ్రహించి ప్రభుత్వానికి లేఖలు రాశారని, వైద్యశాఖలో పోస్టులు భర్తీ చేయాలని, హాస్పిటల్స్ బెడ్స్ పెంచాలని కొన్ని నెలల క్రితమే ఆ లేఖల్లో పేర్కొన్నారని అన్నారు. గవర్నర్ సూచనలను టీఆరెస్ ప్రభుత్వం బేఖాతర్ చేయడం వల్లనే రాష్ట్రమంతా కరోనా విజృంభించిందని భట్టి అన్నారు. కరోనా తీవ్రతను ముందే పసిగట్టి కాంగ్రెస్ పార్టీ కూడా ప్రభుత్వానికి పలుసార్లు లేఖలు రాసిందన్నారు. ప్రతిపక్షాలపై మీడియా పై ఎదురుదాడి చేసుడే కాకుండా గవర్నర్ ను సైతం ఎదురిస్తారా? అంటూ భట్టి విక్రమార్క ప్రభుత్వంపై మండిపడ్డారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ విలువలను బేఖాతర్ చేస్తోందన్నారు. ప్రభుత్వంపై గవర్నర్ విమర్శలు చేస్తే?. విలువలు ఉన్న సీఎంలు గతంలో రాజీనామాలు చేశారని, కేసీఆర్ రాజ్యాంగ విలువలు ఉన్న వ్యక్తి అయితే రాజీనామా చెయ్యాలని భట్టి డిమాండ్ చేశారు. కేసీఆర్ విలువలు లేని వ్యక్తి కాబట్టి- కనీసం గవర్నర్ చెప్పిన సూచనలు అయినా అమలు చేయాలన్నారు. రేషన్ తరహాలో కరోనా బారిన పడిన బీపీఎల్ కుటుంబాలకు కరొనా చికిత్స ఉచితంగా అందించాలన్నారు. గవర్నర్ తన రాష్ట్ర ప్రజల ఆరోగ్యం గురించి మాట్లాడటం అభినందనీయ మని అన్నారు. గవర్నర్ తన వ్యాఖ్యలను మాటలకే పరిమితం చేయకుండా ప్రభుత్వాన్ని అదేశించి ఆచరణలో పెట్టించాలన్నారు. రాజ్యాంగం సృష్టించిన అధిపతి గవర్నర్ పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని సీఎం గవర్నర్ కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కరోనా విషయంలో కేసీఆర్ ప్రభుత్వానికి న్యాయస్థానం పలుసార్లు చురకలు అంటించినా.. ఏ మాత్రం మార్పు లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. హైకోర్టు హెచ్చరికలతో కరోనా టెస్టులు పెంచుతామని చెప్పి కనీసం సగం కూడా చేయడం లేదన్నారు. కేబినెట్‌లో 40వేల టెస్టులు చేస్తామని చెప్పి.. వాటిని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ర్యాపిడ్ టెస్టులు కేవలం 50శాతంకి మాత్రమే పరిమితమైందని.. ఆర్టీపీసీఆర్ టెస్టులు కేవలం రోజుకు 30 మాత్రమే చేస్తున్నారన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్ పై వైద్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ హెచ్చరికలు తాటాకు చప్పుళ్లకు మాత్రమే పరిమితం అయిందన్నారు. నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం కరోనా ట్రీట్మెంట్ ఉచితంగా అందించాలన్నారు జీవన్ రెడ్డి. కరోనా చికిత్సను కేంద్రంలో ఉన్న ఆయుష్మాన్ భారత్ లేదా ఆరోగ్యశ్రీ లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ అధిపతి గవర్నర్ టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఒప్పుకున్నారు కాబట్టి రాష్ట్రంలో హెల్త్ ఎమ్మజ్గ÷న్సీ ప్రకటించాలన్నారు.

# కరోనా నేపథ్యంలో నిరాడంబరంగా పండగలు

### ఉత్సవాలు ఇంటికే పరిమితం కావాలి
### కేంద్ర మార్గదర్శకాల మేరకు గణేశ్ ఉత్సవాలపైన ఆంక్షలు
### ప్రజలు సహకరించాలన్న దేవాదాయశాఖ మంత్రి

నిర్మల్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కరోనా నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం దృష్ట్యా రాష్ట్రంలో పండుగలు నిరాడంబరంగా నిర్వహిస్తున్నామని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరోనా వైరస్ వ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టడానికి భౌతిక దూరం పాటించడం అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ప్రజలు ఒకే చోట గుమిగూడే అవకాశమున్న కార్యక్రమాలపై దేశ వ్యాప్తంగా నియంత్రణ కొనసాగుతున్నదన్నారు.

కొవిడ్ నిబంధనల కారణంగా సామూహికంగా వినాయక చవితి ఉత్సవాలు, మొహర్రం నిర్వహించుకోవడానికి, ఊరేగింపులు జరపడానికి, నిమజ్జనానికి ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు చేయడం కుదరదన్నారు. ఈ విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకుని, ఎవరిళ్లలో వారు ఉత్సవాలు, పండుగలు, మత సంబంధ కార్యక్రమాలు నిర్వహించుకుని సహకరించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ కొవిడ్ మార్గదర్శకాలను అనుసరించి, రాష్ట్రంలో కూడా జనం ఎక్కువగా పోగయ్యే అవకాశం ఉన్న సినిమా హాళ్లు, ఫంక్షన్ హాళ్లు, బార్లు, పబ్బులు, క్లబ్బుల లాంటి వాటిని మూసి వేసిని విషయాన్ని గుర్తు చేశారు. పాఠశాలలు, కళాశాలలు, క్రీడా మైదానాలు, పార్కులను కూడా తెరవడం లేదు. ప్రజల ఆరోగ్యం, ప్రాణాలు కాపాడడవే అతి ముఖ్యం కావున సామూహికంగా నిర్వహించే కార్యక్రమాలన్నింటి పైనా నియంత్రణ కొనసాగుతున్నదని మంత్రి తెలిపారు. కరోనా వైరస్ పై పోరాడడంలో భాగంగా సామూహిక ఉత్సవాలకు అనుమతి ఇవ్వవద్దని కేంద్ర ప్రభుత్వం మార్గ దర్శకాలు ఇచ్చిందని పేర్కొన్నారు. అందులో భాగంగా గత మార్చి 16 నుంచి అన్నిమతాల పండుగలు, ఉత్సవాలను దేవాలయాల్లో కాకుండా ఎవరిళ్లలో వారే నిర్వహించుకుంటున్నారు. ఉగాది, శ్రీరామ నవమి, గుడ్ ఫ్రైడే, రంజాన్, జగ్నే కీ రాత్, బోనాలు, బక్రీద్ తదితర పండుగలు సామూహికంగా కాక ఎవరిళ్లలో వారే భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారని వివరించారు. ప్రభుత్వ పరంగా జరిపే స్వాతంత్య్ర దినోత్సవం, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం కూడా చాలా నిరాడంబరంగా, చాలా తక్కువ మందితో జరిగింది. ఈ నెలలో జరిగే వినాయక చవితి ఉత్సవాలను, మొహర్రంను కూడా కొవిడ్ నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని ప్రజలకు సవినయంగా విజ్ఞప్తి చేస్తున్నానని మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. అన్ని మతాల పండుగలను, ఉత్సవాలను ఏ విధంగానైతే ఎవరిళ్లలో వారు జరుపుకుని, కరోనా వ్యాప్తి నిరోధానికి సహకరించారో వినాయక చవితి, మొహర్రం విషయంలో కూడా అదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరుతున్నాను. ఎవరిళ్లలో వారే వినాయకుడికి పూజలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను. సామూహిక ప్రార్థనలు, ఊరేగింపుల కారణంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉంది. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని మంత్రి కోరారు

# ఆయోధ్య ఆలయ నిర్మాణంలో ముందడుగు

### స్థలంలో భూసార పరీక్షలు చేపట్టిన ఇంజనీర్లు
### రాగిని దానంగా ఇవ్వాలని కోరిన ట్రస్ట్ సభ్యులు

లక్నో,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ):అయోధ్యలో రామాలయ నిర్మాణ ప్రక్రియలో భాగంగా పలు పనులు చేపడుతున్నారు. మందిరం నిర్మించనున్న ప్రాంతంలో ఇంజినీర్లు.. భూసార పరీక్షలను నిర్వహిస్తున్నారు. మందిర నిర్మాణం 36 నుంచి 40 నెలల్లో పూర్తికానున్నది. అయోధ్యలో నిర్మించనున్న రామాలయం కోసం ఈనెల 5వ తేదీన ప్రధాని మోదీ భూమిపూజ చేసిన విషయం తెలిసిందే. శ్రీ రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు సభ్యులు గురువారం ఢిల్లీలో సమావేశం అయ్యారు. రామాలయ నిర్మాణం, నిర్వహణ అంశాన్ని వాళ్లు చర్చించినట్లు సమాచారం. అయితే ట్రస్టు జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్.. రామమందిర వివరాలను బుధవారం వెల్లడించారు. హిందూ భక్తులు ఆలయ నిర్మాణం కోసం రాగిని విరాళం ఇవ్వాలంటూ ఆయన కోరారు. 1990లో శిలలను దానం చేసినట్లుగానే.. దేశవ్యాప్తంగా ఉన్న హిందువులంతా రాగి వైర్లు కానీ, రాడ్లు కానీ దానం చేయాలన్నారు. కనీసం వెయ్యేళ్లు చెక్కుచెదరకుండా ఉండే విధంగా ఆలయాన్ని నిర్మించనున్నట్లు ఆయన చెప్పారు. ఎల్ అండ్ టీ కంపెనీ నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నది. భూపరీక్ష కోసం ఐఐటీ చెన్నై ఇంజినీర్లను పిలిపించినట్లు ఆయన చెప్పారు. భూకంపాల నుంచి ఆలయాన్ని రక్షించుకునే విధంగా ఉండేందుకు సెంట్రల్ బిల్డింగ్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ శాస్త్రవేత్తలు పనిచేయనున్నట్లు చంపత్ రాయ్ చెప్పారు. భక్తులు ఇచ్చిన రాగితో అయోధ్య ఆలయ నాణ్యత మరింత పెరగనున్నట్లు తెలిపారు. నిర్మాణం కోసం రాగి రాడ్లు అవసరమని, కనీసం పది వేల రాడ్లు అవసరం ఉంటుందన్నారు. నిర్మాణం కోసం కేవలం రాళ్లను వాడనున్నట్లు చెప్పారు. ఉక్కును వినియోగించడం లేదన్నారు. అయోధ్య రామాలయ నిర్మాణం కోసం కనీసం 36 నుంచి 40 నెలల సమయం పడుతుందని తెలిపారు. ముస్లింలు కూడా ఆలయ నిర్మాణం కోసం విరాళాలు ఇవ్వవొచ్చు అన్నారు.



తన తండ్రి, ఎమ్మెల్యే రెడ్యా నాయక్ జన్మదినం సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవిలో కరోనా బాధితులకు ఫ్రూట్ జ్యూస్ ప్యాకెట్లు అందచేసిన ఎంపి కవిత

# కరోనా పేషెంట్లలో ధైర్యం నింపాలి: ఎంపి కవిత

మహబూబాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): కరోనా వైరస్ సోకిన వారిలో మానసికధైర్యం నింపాలని.. అది వారు త్వరగా కోలుకోవడానికి ఎంతో ఉపకరిస్తుందని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. కరోనా సోకిన వారి పట్ల కరుణతో వ్యవహరించాలన్నారు. సుమారు ఎనిమిది లక్షల రూపాయల తన సొంత ఖర్చుతో తెప్పించిన పండ్ల రసాల ప్యాకెట్లను పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా ఎంపీ కవిత పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా తన తండ్రి డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ జన్మదినం సందర్భంగా జిల్లాలోని కురవి మండలంలో కరోనా బాధితులకోసం పండ్ల రసాల ప్యాకెట్ల పంపిణీ చేశారు. స్థానిక ఆరోగ్య సిబ్బందికి ప్యాకెట్లను అందజేసి బాధితులకు ఇవ్వాల్సిందిగా ఎంపీ సూచించారు. నిబంధనలు పాటించి, కరోనాను కట్టడి చేద్దామని మెదక్ డీఎంహెచ్వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్వీయ నియంత్రణెళి శ్రీరామ రక్ష అన్నారు. బయటకు రావాల్సి వస్తే మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలని జిల్లావాసులకు సూచించారు.

# రాజీవ్ గాంధీకి కాంగ్రెస్ నేతల నివాళి

### ఆయన సేవలను స్మరించుకున్న నాయకులు
### దేశం కోసం త్యాగం చేసిన కుటుంబం అన్న ఉత్తమ్

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 76వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు.. ఉదయం సోమజిగూడా లోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేశారు. అలాగే గాంధీభవన్ లో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ, వారి కుటుంబీకులు దేశం కోసం అనేక త్యాగాలు చేశారని అన్నారు. గాంధీభవన్‌లో రాజీవ్ గాంధీ 76వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ్ పాల్గొని ప్రసంగించారు. ఇందిరాగాంధీ కుమారునిగా, జవహర్‌లాల్ నెహ్రూ మనుమడిగా రాజీవ్ ఖ్యాతి గడించారన్నారు. 40 ఏళ్ల వయసులో ప్రపంచం ఆశ్చర్య పోయే విధంగా చిన్న వయసులో ప్రధానిగా రాజీవ్ గాంధీ బాధ్యతలు చేపట్టారని కొనియాడారు. అనూహ్య పరిస్థితుల్లో ప్రధానిగా పదవీ బాధ్యతలు స్వీకరించారని గుర్తుచేశారు. చరిత్రలో దేశ పాలనపై రాజీవ్ గాంధీ చెరగని ముద్ర వేశారన్నారు. దేశ నిర్మాణంలో యువతకు భాగస్వామ్యం కల్పించడం కోసం 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన నేత రాజీవ్ గాంధీ అని ఆయన పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాముఖ్యతను గుర్తించి ప్రోత్సహించారని తెలిపారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలపరచడానికి 72వ రాజ్యాంగ సవరణలు తీసుకువచ్చారని చెప్పారు. మొబైల్ ఫోన్లో కంప్యూటర్ల వాడకంలో భారతదేశం నెంబర్ వన్‌గా ఉండడానికి ఆ రోజు రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీయే కారణనమని ఉత్తమ్ తెలిపారు. ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా ఉండాలని కోరుకున్నారన్నారు. దేశ సమగ్రత కోసం రాజీవ్ గాంధీ ప్రాణ త్యాగం చేశారని అన్నారు. భారతదేశంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది స్వర్గీయ ప్రధాని రాజీవ్ గాంధీనే అని చెప్పుకొచ్చారు. అతి చిన్న వయసులోనే రాజీవ్ గాంధీ మనకు దూరమయ్యారని అన్నారు. గాంధీ, నెహ్రూ కుటుంబాలు ఈ దేశానికి చేసిన సేవలను మోదీ ప్రభుత్వం తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తుందని ఆయన విమర్శించారు. నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు దేశం కోసం సమాజం కోసం సేవ చేస్తుంటే వారి చరిత్రను తొక్కి పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. హోంమంత్రి అమిత్‌షా కాశ్మీర్ విషయంలో మాట్లాడుతూ నెహ్రూను తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. తామంతా రాజీవ్ గాంధీ బాటలో నడుస్తూ తెలంగాణలో వచ్చే జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ నాయకులు అంజన్ కుమార్ యాదవ్, మల్లు రవి, దాసోజు శ్రవణ్, ఉజ్మా షకీర్, టి.కుమార్ రావ్, బొల్లు కిషన్, ప్రేమ్ లాల్, ఫిరోజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీకి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీ పీసీసీ అధ్యక్షులు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మాజీ సీఎల్పీ నేత జానారెడ్డి,



రాజీవ్ జయంతిని పురస్కరించుకుని గాంధీభవన్‌లో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించిన కాంగ్రెస్ నేతలు ఉత్తమ్ కుమార్, జానారెడ్డి తదితరులు

# కరోనాతో నవ వరుడి మృతి

చిత్తూరు,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): పెండ్లయిన పదిరోజులకే ఓ నవ వరుడు కరోనాకు మృతి చెందాడు. చిత్తూరు జిల్లా వి.కోట మండలం నెర్నిపల్లిలో ఈ విషాదం చోటుచేసుకున్నది. నెర్నిపల్లి గ్రామానికి చెంది యువకుడికి పది రోజుల క్రితమే వివాహం జరిగింది. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బంధు మిత్రుల సమక్షంలో పెండ్లి జరిగింది. ఆ తర్వాత కరోనా సోకిటనట్లు నిర్ధారణ కావడంతో బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో అతడి ఆరోగ్యం విషమించి గురువారం కన్నుమూశాడు. నవవరుడి మృతితో ఇరు కుటుంబాల్లోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి.

# విశాఖపై విషం చిమ్ముతున్న చంద్రబాబు

### జగన్ పాలనలో విశాఖకు మహర్దశ
### అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే రాజీనామా
### చంద్రబాబుకు ఎమ్మెల్యే గుడివాడ సవాల్

విశాఖపట్నం,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): విశాఖ అభివృద్ధిలో నాడు వైఎస్సార్..నేడు సీఎం వైఎస్ జగన్ మాత్రమే కనిపిస్తారని అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. వైఎస్సార్ హయాంతో పాటు నేడు సీఎం వైఎస్ జగన్ హయాంలో విశాఖలో జరిగిన అభివృద్ధిని మించి చంద్రబాబు చేసినట్లు నిరూపిస్తే తాను రాజీనామాకి సిద్ధమని చంద్రబాబుకి సవాల్ విసిరారు. విశాఖ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విశాఖపై చంద్రబాబు ఎందుకు విషం కక్కుతున్నారో అర్థంకావటం లేదన్నారు. విశాఖ నగరానికి మేలు చేయాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ పరిపాలనా రాజధాని ప్రకటించినప్పటి నుంచి విశాఖ బ్రాండ్ ఇమేజ్ ని దెబ్బతీయాలని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. విశాఖలో అన్నిప్రాంతాల ప్రజలు సంతోషంగా నివసిస్తుంటే ఈ నగరంపై చంద్రబాబు బురద జల్లుతున్నారన్నారు. ఈ

ప్రాంత ప్రజల ఆకాంక్షలకి వ్యతిరేకంగా టీడీపీ వ్యవహరిస్తోందన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న 22 ఏళ్లలో విశాఖకి ఏం చేశారని ప్రశ్నించారు. మీ హయాంలో విశాఖకి చేసిన మేలు ఏమైనా ఉందా అని అడిగారు. రాష్ట విభజన సమయంలో శివరామకృష్ణన్ కమిటీ ఇచ్చిన నివేదికను పక్కనపెట్టి మీరు అమరావతిలో రాజధాని ఎందుకు పెట్టారన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం అనేది పెద్ద స్కామ్ అని.. మూడు పంటలు పండే భూములని రాజధాని పేరుతో తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసింది నిజం కాదా అని గుడివాడ ప్రశ్నించారు. టీడీపీ జాతీయ కార్యదర్శిగా ఉన్న లోకేష్ మంగళగిరిలో ఎందుకు ఓడిపోయారో చెప్పాలన్నారు. మైసూరు బొండాంలో మైసూరు లేనట్లు అమరావతి రాజధానిలో రాజధానిలేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై ఇప్పటివరకు చంద్రబాబు ఎందుకు ఆధారాలు చూపలేకపోయారని ప్రశ్నించారు.

వారిది టీడీపీ కాదు.. టీజేపీ.. టీజేపీ అంటే ట్విటర్ జూమ్ పార్టీ అంటూ ఎద్దేవా చేశారు. ఆధారాలు లేకుండా తప్పుడు ఆరోపణలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. చంద్రబాబు పది మర్డర్లు...లోకేష్ 20 మానభంగాలు చేశారని తాను కూడా ఆరోపించగలనన్నారు. విశాఖని అమ్మకానికి ఎవుడు పెడదామా అన్న చరిత్ర చంద్రబాబుదని ఉదహరించారు. విశాఖలో 20 లక్షల కోట్ల పెట్టుబడులు... 43 లక్షల ఉద్యోగాలు ఇచ్చామని తప్పుడు ప్రచారాలు చేస్తున్న చంద్రబాబుపై ఫిర్యాదు చేయాలనుకున్నా.. ఆయన మానసిక స్థితి చూసి వదిలేశామన్నారు. విశాఖపై చంద్రబాబు ఎందుకు పగబట్టారో అర్థం కావటం లేదన్నారు. అమ్మోనియం నైట్రేట్ నిల్వలపై చంద్రబాబు చెప్పిన మాటలు తర్వాత మాకు అనుమానాలు కలుగుతున్నాయని.. చంద్రబాబు అమ్మోనియం నైట్రేట్ పేలుళ్లకి పాల్పడే కుట్రలు చేస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. చంద్రబాబు ఉచ్చులో పడవద్దని విశాఖ టీడీపీ ఎమ్మెల్యేలని తాను కోరుతున్నట్లు స్పష్టం చేశారు. మీ హయాంలో జరిగిన భూకుంభకోణాలు దేశంలోనే అతిపెద్ద స్కామ్‌లని గుడివాడ ఆరోపించారు. కరోనా కట్టడి చర్యల విషయంలో దేశంలోనే ఏపీ ప్రభుత్వం ఆదర్శంగా ఉందన్నారు. మీ అక్రమాలు బయటపడితే ఇతర దేశాలకి పారిపోవాల్సిందేనని ఎమ్మెల్యే అమరనాథ్ ఎద్దేవా చేశారు.

# సాగర్‌కు పెరుగుతున్న నీరు

### ఎగువన శ్రీశైలం నుంచి భారీగా వరదనీరు రాక
### నేడు గేట్లు ఎత్తేయనున్న అధికారులు
### పర్యాటకులకు అనుమతి లేదని వెల్లడి

నల్గొండ,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): నాగార్జునసాగర్ కు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. భారీ వర్షాలకు తోడు ఎగువన శ్రీశైలం డ్యామ్ గేట్లు ఎత్తి నీటి విడుదల ప్రారంభించడంతో వరద పోటెత్తుతోంది. దీంతో శుక్రవారం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ గేట్లను అధికారులు ఎత్తివేయనున్నారు. ఉదయం 11 గంటలకు సాగర్ ప్రాజెక్టు నాలుగు గేట్లను 5 ఫీట్ల మేర ఎత్తి దిగువకు నీటిని ఎన్ఎస్పీ అధికారులు విడుదల చేయనున్నారు. నాగార్జున సాగర్ సందర్శకుల అనుమతిపై పోలీసుల ఆంక్షలు విధించారు. కరోనా వైరస్ వ్యాప్తి పరిస్థితుల్లో నీటి విడుదల దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు రాకూడదని నందికొండ మున్సిపాలిటీ పాలకవర్గం తీర్మానించింది. నిన్న మొన్నటి వరకు 42 వేల క్యూసెక్కులోపే ఉన్న వరద ఒక్కసారిగా పెరిగింది. బుధవారం ఉదయం 6 గంటల సమయంలో 71,651 క్యూసెక్కులు ఉన్న ఇన్ ఫ్లో గురువారం ఉదయానికి లక్షన్నర క్యూసెక్కులకు పెరిగింది. ఎగువన శ్రీశైలం నుండి విద్యుత్ ఉత్పత్తితోపాటు.. 3 గేట్లు ఎత్తి విడుదల చేస్తుండంతో నాగార్జునసాగర్ నీటిమట్టం మరింత వేగంగా పెరుగుతోంది. గతేడాది ఇదే సమయంలో నాగార్జునసాగర్ పూర్తిగా నిండిపోగా.. ఈసారి కూడా నిండిపోయే అవకాశం కనిపిస్తోంది. ఎగువన తుంగభద్ర.. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం డ్యామ్‌లు పొంగి పారుతున్నాయి. ఇప్పటికే శ్రీశైలంలో విద్యుత్ ఉత్పత్తి ద్వారా విడుదల చేస్తున్న నీరు క్రమంగా నాగార్జునాగర్ కు చేరుకుం టోంది. దీంతో నాగార్జునసాగర్ డ్యామ్ లో నీటిమట్టం వడివడిగా పెరుగుతోంది. మరో రెండు మూడు రోజులు ఇదే వరద కొనసాగితే.. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిగా నిండే అవకాశం ఉంది. నాగార్జున సాగర్ డ్యామ్ పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు.. 312 టీఎంసీలు సామర్థ్యం ఉండగా.. ప్రస్తుతం 574.70 అడుగలతో.. 268.366 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుతం నాగార్జునసాగర్ వద్ద ఇన్ ఫ్లో 1 లక్ష 52 వేల 674 టీఎంసీలు ఉండగా.. దిగువన ఉన్న నది పరివాహక ప్రాంతాల్లోని రైతులకు సాగు.. కాల్వల ద్వారా తాగునీటి అవసరాల కోసం సుమారు నాలుగు వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

# పేదలకు వరంగా డబుల్ ఇళ్లు

### గూడు లేనివారికి కెసిఆర్ వరం
### రాయపర్తిలో ఇళ్లను ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): పేదలకు తమ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లు ఉచితంగా నిర్మించి ఇస్తుందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతకాలని, గూడు లేని వారికి గూడు కల్పించాలన్న లక్ష్యంతో సిఎం కెసిఆర్ పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణం చేపట్టారని అన్నారు. రాయపర్తి మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను జిల్లా కలెక్టర్ హరితతో కలిసి మంత్రి ఎర్రబెల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. పేదల సంక్షేమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సీఎం కేసీఆర్ పేదరిక నిర్మూలనకు పాటుపడుతున్నారని కొనియాడారు. అంతకు ముందు వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తో కలిసి కొబ్బరి మొక్కలు నాటారు. వరద నీటితో సర్వం కోల్పోయిన బాధితులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



.వరంగల్ రూరల్ జిల్లా రాయపర్తిలో డబుల్ ఇళ్లను ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

# రైతులు అవసరం మేరకే ఎరువులు వాడాలి : మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట, ఆగష్టు 20 : సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతు సంక్షేమంతో పాటు పేదల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. దుబ్బాక నియోజక వర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి మండలాల్లోని 515 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్ రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, 3,484 చెరువులకు 2,500 చెరువులు నిండాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు, చెక్ డ్యాములు నిండి మత్తడి దూకుతూ నిండుకుండలా మారాయని మంత్రి వెల్లడించారు. కాళేశ్వరం జలాలతోపాటు దేవుడి కరుణతో ఈ యేటా కురుస్తున్న వర్షాలతో బ్రహ్మాండమైన యాసంగి పంట పండనున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు.

పెట్టుబడి సాయం కింద ఎకరాకు 5 వేల రూపాయల చొప్పున వాన కాలం నాట్లు వేసే సమయానికి 7,300 కోట్ల రూపాయలు రైతులకు అందిచామన్నారు. వానకాలంలో రైతుబంధు ఇచ్చామని, ఈ యాసంగికి రైతుబంధు అందిస్తామని స్పష్టం చేశారు. అలాగే అవసరానికి మించి ఎరువులు వాడొద్దని రైతులకు మంత్రి విజ్ఞప్తి చేశారు. మోతాదుకు అనుగుణంగా యూరియా వేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించాని సూచించారు.

దుబ్బాక అభివృద్ధి పథంలో నడుస్తున్నదని, దుబ్బాకకు 40 వేల మెట్రిక్ టన్నుల గోదాములు మంజూరు అయినట్లు, రాయపోల్ మండలం, దుబ్బాక మున్సిపాలిటీ, ఫైర్ స్టేషన్ వచ్చాయని మంత్రి వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో దుబ్బాకను మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు.

# కొనసాగుతున్న అమీన్‌పూర్ కేసు

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): అమీన్‌పూర్ బాలిక లైంగిక దాడి కేసులో హైపవర్ కమిటీ విచారణ నిర్వహిస్తోంది. బాలికపై లైంగిక దాడి కేసులో ఐదుగురు సభ్యుల కమిటి విచారణ నిర్వహిస్తోంది. ప్రాథమిక నివేదికను హైపవర్ కమిటీ సాయంత్రం అందజేయనుంది. ఇప్పటికే నిందితులను రెండు రోజులు పాటు జ్యూడిషియల్ కస్టడీలోకి తీసుకొని పోలీసులు విచారించారు. కస్టడీలో వెల్లడించిన అంశాలను పోలీసులు వీడియో తీశారు. బాలికపై లైంగిక దాడికి సంబంధించి విచారణలో వెల్లడించిన అంశాలను కమిటీకి పోలీసులు అందజేశారు. ఇప్పటికే కమిటీ చేతికి బాలిక పోస్ట్ మార్టం ప్రైమరి రిపోర్ట్ అందింది. ఐజి స్వాతిలక్రా ఈ కేసును స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో కెఎఫ్‌సి నిర్మాత మృతి

### తండ్రితో పాటు కమలాకర్ రెడ్డి దుర్మరణం

హైదరాబాద్,ఆగస్ట్20(ఆర్ఎన్ఎ): టాలీవుడ్ మరో విషాదకర ఘటన చోటు చేసుకుంది. కేఎఫ్‌సీ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లలో ఒకరైన గుండాల కమలాకర్‌రెడ్డి బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ప్రమాదంలో ఆయనతో పాటు ఆయన తండ్రి నందగోపాల్‌రెడ్డి సైతం అక్కడికక్కడే మృతి చెందారు. కాగా, కమలాకర్‌రెడ్డి తండ్రి నందగోపాల్‌రెడ్డి (75)కి కరోనా పాజిటివ్‌గా నిర్ధారించారు. దీంతో ఆయనను హైదరాబాద్‌లోని ప్రైవేటు దవాఖానకు అంబులెన్స్‌లో తరలిస్తుండగా బుధవారం ఉదయం నల్లగొండ జిల్లా దామచర్ల మండలం కొండప్రోలు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రి కొడుకులిద్దరూ అక్కడిక్కడే మరణించారు. డ్రైవర్ గాయపడగా చికిత్స కోసం మిర్యాలగూడ దవాఖానకు తరలించారు. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపై పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. కమలాకర్‌రెడ్డి కేఎఫ్‌సీ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలో డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. 'కనులు కనులు దోచాయంటే' సినిమాను కేఎఫ్‌సీ తెలుగులో విడుదల చేసింది. ఈ సినిమాకు ఆయన కో ప్రొడ్యూసర్‌గా, అర్జున్‌రెడ్డి, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ సినిమాలతో పాటు హిందీ, తమిళ డబ్బింగ్ సినిమాలకు కూడా డిస్ట్రిబ్యూటర్‌గా వ్యవహరించారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
Editor: B. Devadas, Cell: 9000065433
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com